క్లుప్తంగా

సహకార సంఘంలో కేవైసీ తప్పనిసరి

పాకాల : సహకారం సంఘం ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు రైతులు కేవైసీ చేసుకోవాలని సహకార సంఘం ఇన్‌చార్జి పవనకుమారి, కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలను అందించాలని, ఈ నెల 30వ తేదీ లోగా కేవైసీ చేసుకున్న వారికి మాత్రమే రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందని వెల్లడించారు. రైతులు వెంటనే స్పందించి స్థానిక వ్యవసాయ సహకారం సంఘంలో కేవైసీ చేసుకోవాలని సూచించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న నేతలు

తిరుపతి గాంధీ రోడ్ : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పోస్ట్ ఆఫీస్ ప్రధాన కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం యాదవ్, కట్ట మంచి చంద్రబాబు యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, దీపక్ యాదవ్, పణిభూషణ్‌రెడ్డి, వాసు, శ్రీకాంత్, రహీం, టీడీపీ నేత కళావతి పాల్గొన్నారు.

గంగమ్మ గుడి చైర్మన్ పదవికి వినతి



ఎమ్మెల్యే ఆరణికి వినతి పత్రం ఇస్తున్న బలిజసేన నేతలు

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం చైర్మన్ పదవిని బలిజలకు కేటాయించాలని బలిజసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బలిజసేన నేతలు నీలాద్రి, ఆముదాల తులసీరామ్, గిరి, చిరంజీవి, బుజ్జి, శేషాద్రి, లత, ప్రకాస్, మునిరత్నం, వెంకటరమణ, సతీష్, రమేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

షర్మిలమ్మ వైఖరి సరికాదు

తిరుపతి కల్చరల్ : వైఎస్ షర్మిలమ్మ వైఖరి సరికాదని, ఆమె వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ దివాళా తీసిందని వైఎస్సార్ వీరాభిమాని బొమ్మగుంట రవి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ రక్తం అని చెప్పుకుంటూ తోడబుట్టిన అన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నిందించడం విడ్డూరమని మండిపడ్డారు. వ్యక్తి గతంగా ఏదైనా సమస్య ఉంటే తన అన్నతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. వైఎస్సార్ అభిమానుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం మంచి కాదని హితవు పలికారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రామమూర్తి, కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్ : శ్రీతిరుమల జ్యువెలర్స్ అధినేత రామమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ రోడ్డులో పేదలకు అన్నదానం చేశారు. బచ్చల కరుణాకర్ ఐదో వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పృథ్వీ, కుటుంబ సభ్యులు సుచిత్ర, సుమన పాల్గొన్నారు.

'ఆదిత్య బిల్డింగ్ సొల్యూషన్స్' ప్రారంభం



నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో కంపెనీ అధినేత, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : కపిలతీర్థం రోడ్డులోని మున్సిపల్ పార్క్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య బిల్డింగ్ సొల్యూషన్స్ రెండో బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. కంపెనీ అధినేత నరేంద్ర మాట్లాడుతూ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్‌లో నాణ్యత, మన్నికైన సేవలు అందిస్తూ ప్రజాదరణ పొందుతున్నామన్నారు. అద్భుతమైన ఇంటీరియల్స్ డిజైన్లతో సుందరమైన నిర్మాణాలు అందించడం ప్రత్యేకతని తెలిపారు. ప్రధానంగా మధ్య తరగతి వారికి అనువుగా సేవలు అందించి వారి మన్ననలు అందుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్ట్‌లు క్రాంతి జ్యోతి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

లక్ష్మీ కటాక్షం



తిరుచానూరు పద్మావతీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం శాస్త్రోక్తంగా వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపంలో పద్మపీఠంపై కొలువైన శ్రీమహాలక్ష్మిని సేవించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. విశేష పూజల్లో పాలుపంచుకుని పునీతులయ్యారు. అమ్మవారి కటాక్షం పొంది ఆధ్యాత్మికానుభూతికి లోనయ్యారు. స్వర్ణ రథంపై ఊరేగుతున్న సిరులతల్లిని దర్శించుకుని తరించారు.

– తిరుచానూరు(చంద్రగిరి)





అయ్యప్ప సేవకు పెద్దిరెడ్డి





ఇంటి నుంచి బయలుదేరుతున్న పెద్దిరెడ్డి (ఇన్‌సెట్) ఇరుముడి కట్టుకుంటూ..

తిరుపతి మంగళం : అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మొక్కు చెల్లించుకునేందుకు శుక్రవారం శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా తిరుపతి మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం రైలులో శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. పూజలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ క్యాంటీన్‌కు 'పచ్చ' గ్రహణం

- వేధింపులు తాళలేక ఖాళీ చేసిన నిర్వాహకుడు

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ విభాగాలపై టీడీపీ నేతలు విరుచుకుపడుతున్నారు. అందులో భాగంగానే కలెక్టరేట్‌లో రెండేళ్లుగా సబ్ లీజు విధానంలో క్యాంటీన్ నిర్వహిస్తున్న బుజ్జిరెడ్డిపై వేధింపులకు దిగారు. తమ్ముళ్ల ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన కక్ష సాధింపులు తట్టుకోలేక ఆయన వారం క్రితం క్యాంటీన్ ఖాళీ చేసేశారు. ఇక అప్పటి నుంచి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న 350 మంది ఉద్యోగులు, పలు సమస్యలపై వచ్చే ప్రజలు భోజనంతోపాటు కాఫీ, టీకి కూడా ఇబ్బంది పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి..

క్యాంటీన్ నిర్వాహకుడు బుజ్జిరెడ్డిపై వైఎస్సార్‌సీపీకి మద్దతుదారుడిగా టీడీపీ నేతలు ముద్ర వేసేశారు. తమ్ముళ్ల ఒత్తిడితోనే బుజ్జిరెడ్డిని అధికారులు తప్పించారని జోరుగా చర్చసాగుతోంది. ఎన్నికల సమయంలో అధికారులు చెప్పిన వారికి ఆయన రూ.3.5లక్షలకు ఆహారం అందించారు. అయితే ఆ బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. ఆ బిల్లుల కోసం పట్టుపట్టడంతోనే బుజ్జిరెడ్డిని తొలగించారని సమాచారం. ఈ నేపథ్యంలో వారం రోజులుగా క్యాంటీన్ మూత పడింది.



మూతపడిన కలెక్టరేట్‌లోని క్యాంటీన్

రూ.లక్షల్లో బకాయిలు

ఎన్నికల సమయంలో భోజనంతోపాటు టిఫిన్, ఇతర తినుబండారాలను ఉద్యోగులకు అందించాం. ఆ బిల్లులు రూ.3.5లక్షలు రావాల్సి ఉంది. ప్రతి నెలా రూ.32,500 అద్దె చెల్లిస్తున్నా. మా బకాయిలు చెల్లించకపోగా మాకు నోటీసులు ఇస్తామని అధికారులు చెప్పడం బాధగా ఉంది. పదేపదే అధికారులు తమ కార్యాలయానికి పిలిపించుకుని ఇబ్బందులు పెట్టారు. పొమ్మనలేక పొగపెట్టడంతో ఖాళీ చేసేశాం. ఇప్పటికైనా మా బిల్లులు చెల్లించాలని కోరుతున్నాం.

– బుజ్జిరెడ్డి, క్యాంటీన్ సబ్ లీజుదారుడు

ఎర్ర స్మగ్లర్లకు ఏడాది జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తున్న కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2014 సెప్టెంబర్ 26వ తేదీ చిన్నగొట్టిగల్లు మండలం, ఎస్టీ కాలనీ, బోడిరెడ్డి వారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రచందనం దుంగలను మిట్టపల్లి ధనుంజయరెడ్డి, తుపాకుల రామచంద్ర, తుపాకుల వెంకటరామయ్య అక్రమంగా నరికి తరలిస్తుండగా భాకరాపేట పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ నగేష్ వాదించారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ్ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 115 జయంతిని పురస్కరించుకుని తిరుపత గౌడ్ సంఘం వారు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం పాత మున్సిల్ కార్యాలయం వద్ద లచ్చన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గౌడ్ సంఘం నేతలు యార్లపల్లి గోపి, ఆనంద్‌బాబు, చెంగయ్య, చిరంజీవి గౌడ్, గిరిధర్, మురారి గౌడ్, లోకనాథం పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గంగమ్మ గుడిలో మొక్కుబడిగా వ్రతం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం మొక్కుబడిగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ కమిటీ లేకపోవడంతో వ్రతానికి ప్రచారం, పర్యవేక్షణ చేసేవారు లేకుండా పోయారు. దీంతో చాలా తక్కువ సంఖ్యలో మహిళలు ఆలయంలో వ్రతపూజలకు హాజరయ్యారు. గత ఏడాది వైభవంగా సాగిన వరలక్ష్మీవ్రత పూజలను పలువురు గుర్తుచేసుకోవడం విశేషం.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెడితే సహించం

తిరుపతి కల్చరల్ : తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు మార్గంలో గత 26 ఏళ్లగా భక్తులకు చిరుతిండ్లు విక్రయిస్తూ పొట్టపోసుకుంటున్న చిరు వ్యాపారులను ఇబ్బంది పెడితే సహించే ప్రసక్తే లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్పష్టం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీవారి మెట్టు వద్ద వ్యాపారాలు చేసుకునే వారిపై టీటీడీ అధికారులు తరచూ దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 2019లో అప్పటి సీఎం చంద్రబాబుకు శ్రీవారిమెట్టు వ్యాపారుల సమస్యలపై వినతి పత్రం అందించామని, ఆయన స్పందించి వెంటనే పరిష్కరించాలని నాటి కలెక్టర్ ప్రద్యుమ్నను ఆదేశించారని వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు ఆయన ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. అలిపిరి మెట్ల మార్గంలో చిరుత పులి సంచరించినా అక్కడి దుకాణాలను మూసివేయకపోగా కొత్తవి ఏర్పాటు చేశారని తెలిపారు. పులులు తిరగని శ్రీవారి మెట్టు మార్గంలో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి మానవత్వంతో ఆలోచించి వారిని లీగలైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఈనెల 21వ తేదీన వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్షుడు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి యుగంధర్, మల్లికార్జున, రెడ్డిప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందారపు మురళి

అలరించిన 'పాండవ జననం'

రామచంద్రాపురం: ఎస్ఆర్ కమ్మపల్లె సమీపంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో సాగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భాగవతారిణి సీతాలక్ష్మీ ఆలపించిన పాండవులు, కౌరవుల జననం హరికథ అలరించింది. అనంతరం మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఆర్ కమ్మపల్లెకు చెందిన దినకర్ నాయుడు కుటుంబసభ్యులు అన్నదాన వితరణ చేశారు. ఈ క్రమంలోనే ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే సి.రామాపురంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా సుభద్ర కల్యాణోత్సవం జరిపించారు. వల్లేటి బాబురెడ్డి కుటుంబసభ్యులు అన్నదానం చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీదేవి

యథేచ్ఛగా దారి ఆక్రమించి నిర్మాణాలు



ధర్నాచేస్తున్న కూచువారిపల్లె మాదిగపల్లె గ్రామస్తులు

చంద్రగిరి : చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లెలో ఉన్న సర్వేనెంబర్ 362/2లో కూచి వారి పల్లె మాదిగ పల్లె గ్రామస్తులు 12 మంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. వారి గృహాలకు దారిగా వినియోగించుకుంటున్న కాలువ పోరంబోకు స్థలాన్ని ఓ ఐదుగురు ఆక్రమించుకున్నారు. విలాసవంతమైన భవనాలు నిర్మించుకుంటున్నారు. దీంతో 12 కుటుంబాల వారు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనిపై బాధితులు ప్రశ్నిస్తే ఆక్రమణదారులు పోలీస్ కేసులు పెట్టి వేధిస్తున్నారు. దీంతో దిక్కుతోచని గ్రామస్తులు శుక్రవారం ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివరామ సుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ సమస్య పరిష్కరించకుంటే నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నవీన్, చిట్టెమ్మ, నాగమణి, మునిరాజా, నగేష్, నాగార్జున, వెంకటముని, మాసమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం వాయిదా

తిరుపతి తుడా : శెట్టి పల్లిలోని చేపలచెరువు, చక్రాల బండకు శనివారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పరిపాలనా కారణాల రీత్యా వేలం వాయిదా వేస్తున్నామని వెల్లడించారు. వేలం నిర్వహించే మరో తేదీని త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

అధునాతన సేద్యంతో అధిక లాభాలు

రేణిగుంట: అధునాతన వ్యవసాయ విధానంతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని రాస్ ప్రధా న కార్యదర్శి ఎస్. వెంకటరత్నం అన్నారు. మండలంలోని కరకంబాడి వనస్థలి కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న కేవీకే స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం రాస్ ప్రధాన కార్యదర్శి, కేవీకే చైర్మన్ ఎస్.వెంకటరత్నం, తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధనా సంచాలకులు వి.సుమతీ, రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంతో చేయాలని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు నూతన సాంకేతికత వినియోగించుకుని, కొత్త వంగడాలను సాగు చేయాలని సూచించారు.

అంతర్జాతీయ తపాలా సేవలకు డాక్ ఘర్



తిరుపతిలోని డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం

ప్రపంచీకరణ పుణ్యమా అంటూ దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి అనేక మంది విద్యా.. ఉపాధి కోసం విదేశాలకు వెళుతున్నారు. వారి కోసం కుటుంబీకులు.. స్నేహితులు తినుబండారాలు.. బహుమతులు పంపుతుంటారు. ఇందుకోసం ప్రైవేట్ పార్శిల్ ఏజెన్సీలకు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తుంటారు. అయితే తక్కువ ధరకే సరుకుల రవాణాకు పోస్టల్ శాఖ చర్యలు చేపట్టింది. కస్టమర్లకు నిరంతరం అందుబాటులో ఉంటూ వస్తువులను ఎగుమతి చేస్తోంది. ఇతర దేశాలకు వాణిజ్య సంబంధిత పార్శిళ్లు పంపాలనుకుంటే కావాల్సిన డాక్యుమెంట్స్.. అనుమతులు తదితర సమాచారం అందించేందుకు ×డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది.

- పోస్టల్‌శాఖ ద్వారా విదేశాలకు కొరియర్ సర్వీసులు
- డాక్ ఘర్ నిర్యాత్ పేరుతో పనిచేస్తున్న ప్రత్యేక కేంద్రాలు
- తక్కువ ఖర్చుతో గమ్యస్థానాలకు చేరుతున్న పార్శిళ్లు
- త్వరితగతిన వస్తువులు చేరేలా పర్యవేక్షిస్తున్న అధికారులు

తిరుపతి(అలిపిరి) : ఇండియా పోస్ట్ తన రెక్కలను విస్తరించింది. పోస్టాఫీసుల ద్వారా ఇతర దేశాలకు వాణిజ్య ఎగుమతిని సులభతరం చేసింది. ఇందుకోసం గుర్తించబడిన కార్యాలయాల్లో ×డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం₹ పేరుతో స్టాఫ్ సౌకర్యం కల్పించింది. ఈ కేంద్రం ద్వారా వాణిజ్య ఎగుమతులు చేపడుతోంది. ఇప్పటి వరకు పోస్ట్ ఆఫీసుల్లో ఉత్పత్తులు.. వస్తువులు బుక్ చేసుకునేందుకు పోస్టల్ బిల్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ (పీబీఈ)మాన్యువల్ గా నియమించబడిన పారిన్ పోస్ట్ ఆఫీసు కౌంటర్లలో మాత్రమే ఫైల్ చేసే వెసులుబాటు ఉండేది. ఎగుమతి దారులు వారి వస్తువులను తీసుకురావడం, అక్కడ కస్టమ్స్ ద్వారా పీబీఈ నంబర్ ఇవ్వడం.. ఆ తర్వాత బుకింగ్ చేయడం జరిగేది. కస్టమ్స్ అధికారులు సంతకం చేసిన పీబీఈని ఉపయోగించి ఎగుమతిదారులు టాక్స్ క్లెయిమ్, రీఫండ్ చేసుకునేవారు. అయితే ఇప్పుడు ఆ సమస్యలను దూరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో.. ప్రధాన పోస్టు ఆఫీసులలో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వినియోగదారులు పీబీఈని ఆన్‌లైన్‌లో https://dnk.cept.gov.in/ customers.web/ వెబ్ లింక్ ద్వారా ఇంటి వద్దనే ఫైల్ చేసి డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల నుంచి వారి ఉత్పత్తులను పార్సిల్స్ ద్వారా ఎగుమతి చేసుకోవచ్చు.



పార్శిల్ ఇస్తున్న కస్టమర్

క్షేమంగా గమ్యస్థానాలకు..

ఇ–కామర్స్ .. ఇతర వాణిజ్య ఎగుమతి వస్తువుల బాధ్యత.. భద్రత చాలా ముఖ్యం. ఇందుకోసం కేంద్రాలలో కస్టమర్లకు అందించాల్సిన ప్యాకేజింగ్ సొల్యూషన్లకు సంబంధించి ఓ ప్రత్యేక విభాగం స్థాపించారు. దీంతో పార్శిళ్లను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. త్వరితగతిన వస్తువులు చేరేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

తక్కువ ధరకే..



తక్కువ ధరకే వివిధ ఉత్పత్తులు, వస్తువులను తపాలా శాఖ నుంచి నూతనంగా ప్రారంభించిన ×డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల₹ ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నాం. ఆలస్యం లేకుండా .. అన్ని దేశాలకు పార్శిళ్లు పంపించే అవకాశం ఉంది. ప్రొహిబిటెడ్ వస్తువులైన ఆయిల్స్, డ్రగ్స్, మెడిసిన్స్, బంగారు, వెండి, తుపాకులు, కరెన్సీ వంటివి మినహా మిగిలిన వస్తువులను పంపుకోవచ్చు. వివరాలకు తిరుపతి హెడ్ పోస్టాఫీసులో సంప్రదించవచ్చు.

– జేఎం వసంత, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్